సాక్షి
ఒడిశా

శుక్రవారం। 6। జనవరి। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,19,258లు, బంగారం 220 మిల్లీగ్రాములు, వెండి 50.5 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



తవ్వకాలపై ఉద్రిక్తత

- 8లో



మార్చిలో మెట్రిక్ పరీక్షలు

- 8లో

అట్టహాసంగా.. అంకితం

- రౌర్కెలాలో బిర్సా ముండా అంతర్జాతీయ హాకీ స్టేడియం ప్రారంభం
- 20,000 సీటింగ్ సామర్థ్యంతో 15 నెలల్లోనే నిర్మాణం పూర్తి
- 225 గదులతో నిర్మాణం పూర్తి చేసుకున్న వరల్డ్‌కప్ విలేజ్
- యావత్ దేశానికి బహుమతి: సీఎం నవీన్ పట్నాయక్



నూతన స్టేడియంలో సీఎం నవీన్ పట్నాయక్‌తో భారత హాకీ క్రీడాకారులు



వరల్డ్‌కప్ విలేజ్‌ను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: నిరీక్షణకు తెరపడింది. రౌర్కెలాలో బిర్సా ముండా హాకీ మైదానాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం మధ్యాహ్నం లాంఛనంగా ప్రారంభించి, జాతికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టేడియాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రూ.వెయ్యి కోట్లకు పైగా అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ స్టేడియం నిర్మాణాన్ని 20,000 మంది సీటింగ్ సామర్థ్యంతో రికార్డు స్థాయిలో 15 నెలల్లో పూర్తి చేసినట్లు ప్రకటించారు. ఇందులో దివ్యాంగుల కోసం ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు ఉన్నాయన్నారు. దీనితో పాటు, 225 గదులతో ప్రపంచకప్ హాకీ గ్రామాన్ని కూడా తొమ్మిది నెలల్లో నిర్మించడం గర్వ కారణంగా ఉందని తెలిపారు. ప్రపంచ క్రీడా చరిత్రలో ఈ రోజు ఓ సువర్ణాధ్యాయంగా అభివర్ణించారు. ఈ స్టేడియం భారత జాతికి ఒడిశా సమర్పించిన గొప్ప కానుకగా పేర్కొన్నారు. హాకీ క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో ప్రముఖ క్రీడాకారులను ఆవిష్కరించే శక్తివంతమైన స్టేడియంగా వెలుగొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రపంచ ప్రఖ్యాత హాకీ క్రీడాకారులకు జన్మనిచ్చిన ఈ ప్రాంతం హాకీ సువర్ణ క్షేత్రంగా భాసిల్లుతుందన్నారు. దేశంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒడిశా ప్రాముఖ్యతను మరింత ప్రకాశవంతం చేస్తుందని పేర్కొన్నారు. హాకీపై భారతీయుల అభిరుచి, ప్రేమను ప్రతిబింబిస్తునే ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన పోరాట యోధుడు బిర్సా ముండాకు ముఖ్యమంత్రి నివాళులర్పించారు. హాకీ అభిమానులు, క్రీడాకారులు, సాధారణ ప్రజలు, ఒడిశా హాకీ ప్రేమికులు, దేశంలోని హాకీ క్రీడాకారులందరికీ ఈ స్టేడియాన్ని అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. హాకీ ప్రపంచకప్ భారీ వేడుకలో పాల్గొనడానికి హాకీ ప్రియులను ఆయన ఆహ్వానించారు.

359 ప్రాజెక్టులు సైతం..

పురుషుల హాకీ ప్రపంచకప్–2023 సందర్భంగా రూర్కెలాలో మో బస్ సేవలను సీఎం నవీన్ ప్రారంభించారు. అలాగే రూ.417.77 కోట్ల వ్యయంతో నిర్మించిన సుందర్‌గడ్ ప్రభుత్వ వైద్య కళాశాలను అందుబాటులోకి తీసుకు వచ్చారు. అంతకుముందు 225 గదుల ప్రపంచ హాకీ గ్రామాన్ని, అనంతరం బాసంతి కాలనీ డీఏవీ పోఖారీలో మోబస్ సేవలు, మెడికల్ కాలేజీతో పాటు జిల్లాలో 359 ప్రాజెక్టులను ప్రారంభించారు. కొన్ని కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి 5టీ సెక్రటరీ వీకే పాండ్యన్, క్రీడలు–యువజన వ్యవహారాల శాఖ మంత్రి తుషారకాంతి బెహరా, ఉన్నత విద్యాశాఖ మంత్రి రోహిత్ పూజారి, నైపుణ్యాభివృద్ధి శాఖామంత్రి పృథ్వీరంజన్ ఘొడై, బిజూ జనతాదళ్ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్‌దాస్, రౌర్కెలా ఎమ్మెల్యే శారదాప్రసాద్ నాయక్, రఘునాథపల్లి ఎమ్మెల్యే సుబ్రత్ తొరై, సుందర్‌గఢ్ ఎమ్మెల్యే కుసుమ్ టెట్టే, బీరమిత్రపూర్ ఎమ్మెల్యే శంకర్ ఓరాం హాజరయ్యారు. ముఖ్యమంత్రి సందర్శన పురస్కరించుకుని పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. 33మంది ఇన్‌స్పెక్టర్లు, 135మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు అదనపు ఎస్పీలు, ముగ్గురు డీఎస్పీలతో మొత్తం 36 ప్లాటూన్ల పోలీసు బలగాలను బందోబస్తులో నియమించారు.



భువనేశ్వర్ చేరుకున్న సందర్భంలో చిలీ పురుషుల హాకీ ప్రపంచకప్ జట్టు



బిర్సాముండా స్టేడియంలో ప్రపంచకప్ మస్కట్‌తో ముఖ్యమంత్రి అభివాదం



నెదర్లాండ్స్ క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కప్ కొట్టు.. రూ.కోటి పట్టు..

భువనేశ్వర్: రౌర్కెలా బిర్సా ముండా హాకీ స్టేడియం సముదాయంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వరల్డ్‌కప్ విలేజ్‌ను ప్రారంభించారు. ఈ గ్రామంలో ప్రపంచకప్ స్థాయికి తగిన అన్ని సౌకర్యాలతో 225 గదులను నిర్మించారు. రికార్డు స్థాయిలో తొమ్మిది నెలల స్వల్ప వ్యవధిలోనే దీనిని అభివృద్ధి చేయడం విశేషంగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పురుషుల హాకీ జట్టుతో సంభాషించారు. టీమ్ ఇండియా హాకీ ప్రపంచకప్ గెలిస్తే ఒక్కో ఆటగాడికి రూ.కోటి నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు ప్రకటించారు. భారత్ జట్టు పోటీల్లో ఛాంపియన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్లకు ప్రపంచకప్ విలేజ్‌తో హాకీ ప్రాక్టీస్ సెంటర్, స్టేడియం సంపూర్ణ అనుకూల వాతావరణాన్ని ప్రసాదిస్తుందన్నారు.

అతిథి దేవోభవ..

భువనేశ్వర్: 15వ హాకీ పురుషుల ప్రపంచకప్–2023 సంబరాలు సమీపిస్తున్న కొద్దీ వివిధ దేశాల నుంచి అంతర్జాతీయ జట్టు క్రీడాకారులు రాష్ట్రానికి అంచెలంచెలుగా చేరుతున్నారు. వీరందరికీ భారతీయ సంప్రదాయ రీతుల్లో బస చేసే హోటల్ ప్రాంగణాల్లో సాదరంగా స్వాగతం పలుకుతున్నారు. గురువారం చిలీ జట్టు, బుధవారం రాత్రి నెదర్లాండ్స్ ప్రపంచకప్ జట్టు క్రీడాకారులు నగరానికి చేరారు.

న్యూస్‌రీల్

గారబందలో విద్యాలయ క్రీడోత్సవాలు



క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న జెడ్పీ చైర్మన్, కలెక్టర్

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి గారబందలో వేంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాలయాల జిల్లాస్థాయి సామూహిక క్రీడాపోటీలను జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు గురువారం ప్రారంభించారు. గౌరవ అతిథిగా కలెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా క్రీడాధికారి ఇన్‌చార్జి, డిప్యూటీ కలెక్టర్ నట్వర గౌరడా పాల్గొన్నారు. ఇందులో సీనియర్, జూనియర్ విభాగాల్లో వివిధ సమితుల నుంచి 375మంది విద్యార్థులు హాజరయ్యారు. హెచ్ఎం బి.తిరుమలరావు పట్నాయక్, జిల్లా ముఖ్య విద్యాధికారి ప్రదోష్‌కుమార్ నాయక్, గుసాని బీడీఓ నీలమాధవ మఝి, జిల్లా సూపరింటెండెంట్ సురేంద్రకుమార్ పాత్రో, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌కుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పుషిపుని మహోత్సవం



కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరిస్తున్న కో-ఆర్డినేటర్ ధీరెన్ పట్నాయక్

జయపురం: ప్రసిద్ధి చెందిన బొరొగొడ ధనుజాతర తరహాలో జయపురంలో పుషిపుని పర్వ్ మహోత్సవాన్ని ఈనెల 6(శుక్రవారం) నుంచి 16 వరకు నిర్వహించనున్నట్లు ప్రముఖ కళాకారుడు, పుషిపుని మహోత్సవం కమిటీ కో-ఆర్డినేటర్ ధీరేన్ మోహణ పట్నాయక్ వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఇందులో భాగంగా కొరాపుట్ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మా భగవతి మందిరం నుంచి ర్యాలీ ప్రారంభించి, సర్దార్ పటేల్ మార్గం మీదుగా దసరా పొడియా వరకు వందలాది మంది కళాకారులు, పౌరాణిక పాత్రల వేషధారణ మధ్య జరగనున్నట్లు తెలిపారు. 7న జిల్లా గాయకులు ఆదివాసీ గీతాలాపన, 8న నృత్య ప్రదర్శనలు, 9న ఆదివాసీ ఏకాంకిక నృత్యాలు, 10న నాటక ప్రదర్శన, 11న హాకీ ప్రపంచకప్ ప్రదర్శనతో పాటు మనోరంజక కార్యక్రమాలు, 12న కళాకారుల నృత్య ప్రదర్శన, 13న జయపురం కళాకారుల చలనచిత్ర ప్రదర్శన, 14న ఆదివాసీ వేషధారణలు, ఫ్యాషన్ షో, 15న కళాకారుల చలనచిత్ర ప్రదర్శన, 16న పుషిపుని మహోత్సవం ముగింపు జరగనున్నట్లు వివరించారు. అలాగే పల్లిశ్రీ మేళా, హస్తకళా ప్రదర్శన, ఆహార స్టాల్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మునిగుడలో వనమూలికల మేళా



వన మూలికల మేళాను ప్రారంభిస్తున్న దాస్

రాయగడ: ప్రకృతి వైద్యంలో భాగమైన వన మూలికలు మానవాళికి ఎంతో మేలు చేస్తాయని కొరాపుట్ అటవీశాఖ అధికారి సుదీప్తదాస్ అన్నారు. జిల్లాలోని మునిగుడలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమూలికా మేళా–23ను ఆయన గురువారం ప్రారంభించి, మాట్లాడారు. అలోపతితో నయంకాని ఎన్నో రోగాలు ప్రకృతి వైద్యంతో నయమవుతున్న ఘటనలు ఆనందకరమన్నారు.

బైక్ అంబులెన్స్ ప్రారంభం



బైక్ అంబులెన్స్ ప్రారంభిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా బొడపాడా పంచాయతీలో నాబార్డు, పరివర్తన సంస్థలు సయుక్తంగా బైక్ అంబులెన్స్ సేవలను సంస్థ అధ్యక్షుడు ధర్మేంద్ర బెవురియా గురువారం ప్రారంభించారు. గర్భిణులు, మహిళలు, వృద్ధులు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చామని వివరించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సోమారి టంగులు, చిత్రకొండ సమితి అధ్యక్షురాలు రాజేశ్వరీ ఖిలో, వైద్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 5జీ సేవలు

- ప్రారంభించిన కేంద్ర టెలికాం శాఖామంత్రి అశ్విని వైష్ణవ్
- విప్లవాత్మక పురోగతికి నాందిగా అభివర్ణించిన మంత్రి



రాష్ట్రంలో 5జీ సేవలను ప్రారంభిస్తున్న కేంద్ర టెలికాం శాఖామంత్రి అశ్విని వైష్ణవ్



వేదికపై కేంద్రమంత్రులు, అతిథులు

భువనేశ్వర్: ఒడిశా టెలీ కమ్యూనికేషన్ రంగంలో కొత్త శకం ఆరంభమైంది. రాష్ట్రంలో 5జీ టెలికాం సేవలు ప్రారంభమయ్యాయి. భువనేశ్వర్ లోని శిక్ష్యా ఓ అనుసంధాన్ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సేవలను కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ, టెలి కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. 5జీ టెలికాం సేవలు రాష్ట్రంలో పరిశ్రమలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, పర్యాటకం, రవాణా రంగాల్లో విప్లవాత్మక మార్పులను ప్రేరేపిస్తాయని తెలిపారు. దేశంలో 50 నగరాల్లో తొలి విడతగా 5జీ సేవలు అందుబాటులో ఉండగా, రాష్ట్రంలో గురువారం నుంచి ప్రారంభించామన్నారు. భువనేశ్వర్, కటక్ జంట నగరాలతో పాటు రాష్ట్రంలో మరికొన్ని ప్రాంతాల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ప్రకటించారు. 5జీ సామర్థ్యం కలిగిన మొబైల్ వినియోగదారులకు ఈ సేవలు లభిస్తాయన్నారు. 5జీ ఇంటర్నెట్ స్పీడ్ 4జీ కంటే 10రెట్లు అధికంగా ఉంటుందన్నారు. ఈ విస్తరణ విద్య, ఆరోగ్యం, నిర్మాణం, బ్యాంకింగ్ తదితర రంగాల్లో పెను మార్పులు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టెలికాం రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.5,600 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. రాష్ట్రంలో 7వేల గ్రామాలకు టెలికాం సేవలు కల్పించేందుకు త్వరలో కొత్తగా 1000 టవర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. 5జీ సేవలు ప్రారంభం పురస్కరించుకుని మారుమూల కలహండి, మయూర్‌భంజ్, మల్కన్‌గిరి, నవరంగపూర్, కొరాపుట్ జిల్లాలో 100 కొత్త సెల్‌టవర్లు ప్రారంభించారు. శిక్ష్యా ఓ అనుసంధాన్ విశ్వ విద్యాలయం, రిలయన్స్ జియో మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఈ క్యాంపస్‌లో 5జీ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

'అమొ హాస్పిటల్' ఏర్పాటుకు చర్యలు

- రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్ షాలిని పండిత్



షాలినీ పండిత్

భువనేశ్వర్: రాష్ట్రప్రభుత్వం అమొ హాస్పిటల్(మన ఆస్పత్రి) కార్యక్రమం అమలు చేసేందుకు చురుగ్గా సన్నాహాలు చేపట్టింది. 5టీ కార్యక్రమం కింద కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సబ్ డివిజనల్ హెల్త్ సెంటర్లు, జిల్లా కేంద్ర ఆస్పత్రుల వ్యవస్థ సంస్కరణతో బలోపేతం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ షాలిని పండిత్ వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం గుర్తించిన ఆస్పత్రులను అమొ హాస్పిటల్(మన ఆస్పత్రి)గా మార్చేందుకు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్లకు లేఖ రాసినట్లు తెలిపారు. ఈ చొరవ కింద, అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), సబ్ డివిజనల్ హెల్త్ సెంటర్లు(ఎస్‌డీహెచ్‌లు), జిల్లా కేంద్రాస్పత్రులు(డీహెచ్‌హెచ్‌లు) దశల వారీగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఇదే నెలలో ప్రారంభించి, మొదటి రెఫరల్ యూనిట్లు(ఎఫ్ఆర్‌యూ) అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం లక్ష్య సాధనకు వ్యయ భారం రాష్ట్ర బడ్జెట్, జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం), జిల్లా ఖనిజ నిధి(డీఎంఎఫ్), ఓఎంబీఏడీసీ వనరుల నుంచి సర్దుబాటు చేయనున్నట్లు స్పష్టంచేశారు. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ఆ పైబడిన సంస్థల్లో భౌతిక ఆరోగ్య మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, జిల్లా ప్రధాన ఆస్పత్రుల్లో రోగులకు మౌలిక సౌకర్యాలు మెరుగు పరచడం, నాణ్యమైన ఆరోగ్య సేవల ధ్రువీకరణతో సత్వర సేవల లభ్యత వ్యవస్థ ఏర్పాటు మన ఆస్పత్రి కార్యక్రమ ప్రధాన లక్ష్యాలుగా వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనుండగా, జిల్లా ప్రధాన వైద్య అధికారి(సీడీఎంఓ), ఇతరేతర ఉన్నతాధికారులతో అనుబంధ సిబ్బంది శ్రేణులను సభ్యులుగా నియమించి భావి కార్యాచరణ ప్రతిపాదించాలని లేఖలో సూచించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కోర్ కమిటీ సమావేశంలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి పురంధేశ్వరి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి పురంధేశ్వరి

పర్లాకిమిడి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పర్లాకిమిడి, మోహానా నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే పని చేయాలని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి డి.పురంధేశ్వరి పిలుపునిచ్చారు. పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. గజపతి జిల్లా కార్యవర్గం, యువజన, మహిళా, కృషక్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మోర్చా నాయకులు తమకు అప్పగించిన బాధ్యతను దిగువ స్థాయి నుంచే అమలు చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా పార్టీ జెండాను ఎగుర వేసేందుకు అంతా సమన్వయంతో పని చేయాలన్నారు. అయితే కోర్ కమిటీ సమావేశానికి పలువురు ముఖ్య నాయకుల గైర్హాజరుపై పురంధేశ్వరి విచారం వ్యక్తం చేశారు. సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోడూరు నారాయణరావు అధ్యక్షత వహించగా, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భృగు బక్షిపాత్రో, రాష్ట్ర ప్రభారి సరోజ్ సాబత్, మానస్ తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆమె రాయగడ జిల్లాకు పయనమయ్యారు.



కోర్ కమిటీ సమావేశానికి హాజరైన జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పద్మపూర్‌లో చౌయితి ఉత్సవాలు

- సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్న జెడ్పీ, ఎస్‌డీసీ చైర్‌పర్సన్లు



వేదికపై నృత్యాలు చేస్తున్న బీడీఓ రీనా ప్రధాన్, సరస్వతి, అనసూయ మాఝి



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గొమాంగో, సరస్వతీ, అనసూయ మాఝి

రాయగడ: జిల్లాలోని పద్మపూర్‌లో సమితిస్థాయి చౌయితి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో ముఖ్య అతిథిగా పాల్గొనగా, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షురాలు అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సమీపంలోని నది నుంచి శుద్ధ జలాలు తీసుకువచ్చి, ఉత్సవ వేదికపై ప్రతిష్ఠించి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతికి అద్దం పట్టే పండుగల్లో చౌయితి ప్రధానమైనదిగా పేర్కొన్నారు. ఏటా సమితి స్థాయిలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తుండగా, ఈనెల 18 నుంచి జిల్లా కేంద్రంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లాస్థాయి ఉత్సవాలు జరుగనున్నాయని ప్రకటించారు. దీనికి సంబంధించి సన్నాహాలు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని 11 సమితుల్లో ఈ ఉత్సవాలు పూర్తయిన అనంతరం అంతా జిల్లాస్థాయి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పద్మపూర్‌లో సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు చేపట్టారు. బీడీఓ రీనా ప్రధాన్, అనసూయ మాఝి, సరస్వతి మాఝి నృత్య ప్రదర్శనలు చేసి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

108లో గిరిజన మహిళ ప్రసవం



108లో ప్రసవించిన గిరిజన మహిళ

సీతంపేట: ఎత్తైన కొండల మీద ఉన్న పూతికవలస పంచాయతీ పరిధి ఈతమానుగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఆరిక పద్మావతి 108లో బుధవారం అర్ధరాత్రి ప్రసవించింది. పురిటినొప్పులతో ఆమె బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేశారు. ఈఎంటీ రాములు, పైలెట్ సింహాచలం గ్రామానికి వెళ్లి గర్భిణిని సీతంపేట ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌ను పక్కన ఆపిన అంబులెన్స్ సిబ్బంది చాకచక్యంగా డెలివరీ చేయించడంతో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే దగ్గర్లో ఉన్న మర్రిపాడు పీహెచ్‌సీలో ఆమెను చేర్పించారు. 108 సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

రామతీర్థం హుండీల ఆదాయం రూ.26.51 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని దేవస్థానం అధికారులు గురువారం లెక్కించారు. మొత్తం 89 రోజులకు గానూ రూ.26,51,272 ఆదాయం లభించినట్లు ఈఓ ప్రసాదరావు తెలిపారు. దేవస్థాన సహాయ కమిషనర్ కిశోర్ కుమార్ హుండీ లెక్కింపును దగ్గరుండి పర్యవేక్షించారు. సుమారు 180 మంది శ్రీవారి సేవా భక్తులు హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

గర్జించిన బొబ్బిలి టైగర్స్



నిర్వాహకుల చేతులమీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విజేతలు

బొబ్బిలి రూరల్: ఈనెల 2,3తేదీలలో అనంతపురంలో నిర్వహించిన అంధుల క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలలో బొబ్బిలి టైగర్స్ జట్టు విజయం సాధించింది. లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా విజువల్లీ ఛాలెంజ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్, ది బ్లైండ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో 9జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో నేత్ర టీంపై బొబ్బిలి టీం విజయం సాధించింది. లంక వెంకటేష్ టీమ్‌కు నేతృత్వం వహించారు. వరుసగా ఏడోసారి బొబ్బిలి టీమ్ రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించింది. టీమ్ సభ్యులంతా బొబ్బిలి మండలం మెట్టవలస ఏషియన్ ఎయిడ్ ఫర్ ద బ్లైండ్ అంధుల పాఠశాలలో చదువుకుని పలు ప్రాంతాలలో ఉద్యోగాల్లో స్థిరపడిన వారు. వారికి నిర్వాహకులు జ్ఞాపికతో పాటు రూ. 12వేలు అందజేశారు. పలువురు ప్రముఖులు, క్రీడాభిమానులు జట్టు సభ్యులను అభినందించారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి పంచాయతీలో ముగ్గురు, ఎం.హరిపురంలో ముగ్గురు పేకాట ఆడుతుండగా పట్టుబడడంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కళాధర్ తెలిపారు.వారి నుంచి రూ.7600 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో కోడి పందాలు ఆడినా, పేకాట ఆడినా సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

22 మందికి కారుణ్య నియామకాలు

- సచివాలయాలలో పోస్టింగ్



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డీఆర్‌ఓ గణపతిరావు


విజయనగరం అర్బన్: ఆర్‌టీసీలో ఉద్యోగం చేస్తూ మరణించిన వారి వారసులు 22 మందికి సచివాలయాల్లో కారుణ్య నియామకాలు కల్పిస్తూ కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీచేశారు. 22 మందిలో 10 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లుగా, మిగిలిన వారిని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా నియమించారు. ఈ ఉత్తర్వులను డీఆర్‌ఓ ఎం.గణపతిరావు గురువారం తన చాంబర్‌లో అభ్యర్థులకు అందజేశారు.

తవ్వకాలపై ఉద్రిక్తత

- భద్రతా వలయంలో దండకారణ్య గిరిజన గ్రామాలు
- మాలి పర్వతం గనులపై 7న ప్రజాభిప్రాయ సేకరణ
- రంగంలో దిగిన రాష్ట్ర హైకోర్టు



మావోయిస్టుల విడుదల చేసిన లేఖ



గిరిజన గూడల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలు



వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులు



కొరాపుట్ కలెక్టరేట్ వద్ద మాలి పర్వత సురక్ష సమితి సభ్యుల నిరసన



ప్రజాభిప్రాయ సేకరణపై గిరిజనులకు మైక్‌లో సూచనలందిస్తున్న పోలీసులు

కొరాపుట్: దండకారణ్యంలో మరోసారి గనుల తవ్వకాలపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొరాపుట్ జిల్లాలో గురువారం రోజంతా ఉత్కంఠ పరిణామాలు జరిగాయి. ఈనెల 7న మాలి పర్వతం తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. గతంలో జరిగిన సభలు హింసాత్మక పరిస్థితుల మధ్య నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ విడత సభకు ప్రాధాన్యం సంతరించుకుంది. బాక్సైట్ గనులు ఉన్న కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితిలోని సిరిసిపాదర్, కుడి, పక్కజోల, దొలాయిగుడ పంచాయతీల్లోని 21 గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తగా 144 సెక్షన్ విధించారు. ప్రజాభిప్రాయ సేకరణ సభకు గిరిజనులు స్వచ్ఛందంగా రావాలని పిలుపునిచ్చారు. గతంలో తరహాలో తమ సంప్రదాయ ఆయుధాలతో వస్తే అంగీకరించమని స్పష్టంచేశారు. సభా ప్రాంగణంలో ఎటువంటి కరపత్రాలు, మైక్ శబ్దాలు, బ్యానర్లు, డప్పుల అనుమతించమన్నారు. వందల సంఖ్యలో పోలీసులు ఆయా గ్రామాల వద్ద పికెటింగ్ ఏర్పాటు చేసి, ఇంటింటా గాలింపు చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో గిరిజనులు భయంతో వణికి పోతున్నారు.

పరిస్థితి అదుపులోనే ఉంది..

సునాబెడా ఎస్‌డీపీఓ మనోజ్‌కుమార్ బెహరా అత్యవసర మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పరాయి వ్యక్తులను ఈనెల 7వరకు ఈ ప్రాంతంలోకి అనుమతి లేదన్నారు. ఆయుధాలతో సభకు ఎవరినీ రానివ్వమని తెలిపారు. పూర్తిస్థాయిలో అదనపు బలగాలను మొహరించామని, సభ ప్రశాంతంగా జరగడానికి ఏర్పాట్లు చేశామన్నారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, హింసాత్మక ఘటనలకు తావు లేకుండా 144 సెక్షన్ విధించామని ప్రకటించారు. ప్రస్తుతం సిమిలిగుడ, సునాబెడా, కొరాపుట్ లోని లాడ్జీల్లో పరాయి వ్యక్తులు దిగితే తనిఖీలు చేస్తున్నామన్నారు. నాకాబందీ చేస్తూ వాహనాలు పరిశీలిస్తున్నామని వివరించారు.

కలెక్టర్‌ను కలసిన సభ్యులు..

మాలి పర్వతం సురక్ష సమితి సభ్యులు కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్‌ను కలెక్టరేట్‌లో కలుసుకున్నారు. ప్రజా సభలో తమకు భద్రత కల్పించాలని విన్నవించారు. హైకోర్టు ఆదేశాలు తూచా తప్పక అమలు చేయాలని కోరారు. తాము ప్రశాంతంగా ర్యాలీలతో వచ్చి అభిప్రాయం చెబుతామన్నారు. గనుల తవ్వకాల కోసం ప్రయత్నం చేస్తున్న సంస్థకు చెందిన కిరాయి వ్యక్తులు తమ ప్రాణాలకు హానీ కలిగిస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. తాము ఇది వరకే హైకోర్టును ఆశ్రయించామని గుర్తు చేశారు. ఏదిఏమైనా మాలి పర్వతంపై తవ్వకాలను అంగీకరించమని స్పష్టంచేశారు.

హైకోర్టు జోక్యం..

మాలి పర్వతం సమస్య రాష్ట్ర హైకోర్టు జోక్యం చేసుకుంది. సభకు పూర్తి భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించింది. సభలో జిల్లా కలెక్టర్, న్యాయమూర్తి, ఎస్పీ, పర్యావరణ, అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొవాలని సూచించింది. పూర్తి ప్రక్రియ వీడియో చిత్రీకరణ జరగాలని, పరాయి వ్యక్తులను అనుమతించరాదని, ఆయుధాల ప్రవేశం ఉండరాదని విధి విధానాలు ప్రకటించింది.

మావోయిస్టుల హెచ్చరికలు..

మరోవైపు మావోయిస్టులు ఈ సమస్యపై స్పందించారు. ఆంధ్రా–ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీ గణేష్ తీవ్రంగా స్పందించారు. మాలి పర్వతం తవ్వి, బాక్సైట్ గనులు తరలింపును గిరిజనులు స్వచ్ఛందంగా వ్యతిరేకిస్తున్నారని తెలిరు. ఈ తవ్వకాల కోసం ప్రయత్నించిన ఆనంద్ కిర్సానీని తాము 2013 లోనే హత్య చేసిన విషయం గుర్తు చేశారు. ఆ పరిస్థితి ఎవరికీ పట్టకుండా ఉండాలంటే గనుల మాఫియాకు కొమ్ము కాయవద్దని హెచ్చరించారు. ఈ లేఖ డిసెంబర్ 25న విడుదలైనప్పటికీ గురువారం కరపత్రాల రూపంలో గిరిజన గూడల్లో కనిపించాయి. అలాగే ఆడియో కూడా ఒడియా భాషలో మహిళా మావోయిస్టు గొంతుతో ఈ ప్రాంతంలో వైరల్‌గా మారింది.

అధికార యంత్రాంగానికి సంకటం..

మాలి పర్వతం తవ్వకాలు అధికారులకు సంకటంగా మారింది. ఈ వివాదం గత 20ఏళ్లుగా కొనసాగుతోంది. గనులు తవ్వకాలకు 90శాతం మంది గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం గనుల తవ్వకానికి ప్రజాభిప్రాయ సేకరణ తప్పనిసరి. గతంలో 2సార్లు ప్రచారం లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ సభలు నిర్వహించడం, చివరి నిమిషంలో గిరిజనులకు తెలియడంతో అధికారులు చావుదెబ్బలు తినడం చోటు చేసుకున్నాయి. పరిశ్రమల వర్గాలు గిరిజనుల్లో చీలికలు తేవడానికి చేసిన ప్రయత్నాలు కూడా విఫలమవుతున్నాయి. చివరకు హైకోర్టు నిబంధనలతో సభ నిర్వహించక తప్పనిసరిగా మారింది. ఈదఫా కూడా గిరిజనుల అనుమతి లేకపోతే ఏం చేయాలో అర్థంకాక అధికారులు తలలు పీక్కుంటున్నారు. గతంలో మావోయిస్టుల భయంతో చర్యలు వేగవంతం చేయలేకపోయారు. ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం తగ్గిన తర్వాత హైకోర్టు గిరిజనుల అండగా నిలవడం, 7వ సభ కోసం ముందస్తుగా పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో గందరగోళ వాతావరణం నెలకొంది.

మార్చిలో మెట్రిక్ పరీక్షలు

- మార్చి 10 నుంచి ప్రారంభం
- రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహణ



మాట్లాడుతున్న బీఎస్‌ఈ అధ్యక్షుడు రమాశిష్ హజ్రా



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యాబోర్డు(బీఎస్‌ఈ) పదో తరగతి(మెట్రిక్యులేషన్) పరీక్షల తేదీలను ప్రకటించింది. ఈ ఏడాది మార్చి 10 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు మార్చి 17 వరకు జరుగుతాయని బీఎస్‌ఈ అధ్యక్షుడు రమాశిష్ హజ్రా వెల్లడించారు. బోర్డు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయనతో ఉపాధ్యక్షుడు నిహార్ రంజన్ మహంతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈసారి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సమయంగా ప్రకటించారు. గణితం పరీక్షకు అదనంగా పావుగంట(15 నిముషాలు) కేటయిస్తారు. మెట్రిక్యులేషన్ పరీక్షల దరఖాస్తు భర్తీ తేదీ వివరాలను త్వరలో ప్రకటిస్తామని రాష్ట్ర మాధ్యమిక విద్యాబోర్డు ఉపాధ్యక్షుడు నిహార్‌రంజన్ మహంతి పేర్కొన్నారు.

ఫిబ్రవరి 22 నుంచి మూల్యాంకన..

పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు భర్తీ, దాఖలు చేయాల్సి ఉంటుందని అధికారులు సూచించారు. వృత్తి విద్య ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 15నుంచి 22 వరకు జరగనున్నాయన్నారు. రాష్ట్రంలోని 5 లక్షల 43వేల మంది విద్యార్థులు ఈసారి మెట్రిక్ పరీక్షలకు హాజరు కానున్నట్లు అంచనా. వీరి కోసం 3,029 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో పరీక్షల సంబంధిత సమగ్ర సమాచారం అందుబాటులో ఉందని తెలిపారు. సమ్మెటివ్–1 పరీక్షలు పుర్కరించుకుని ఖరారు చేసిన పరీక్ష కేంద్రాలు, నోడల్ కేంద్రాలు సమ్మెటివ్–2లో యథాతథంగా కొనసాగుతాయన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 22 నోడల్ కేంద్రాలను పోలీసు ఠాణాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో ప్రశ్న పత్రాలు భద్రపరచి, పరీక్ష రోజు ఉదయమే కేంద్రాలకు తరలిస్తారు. మెట్రిక్యులేషన్ కంటే ముందుగా 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి 20 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు బోర్డు అధికారులు మీడియాకు తెలియజేశారు. ఫిబ్రవరి 22 నుంచి 28 వరకు జవాబు పత్రాల మూల్యాంకన చేపట్టనున్నట్లు వివరించారు.

ఆంధ్రా జట్టు రెండవ ఇన్నింగ్స్ 462

- నేటితో ముగియనున్న ఆంధ్రా–హైదరాబాద్ రంజీ మ్యాచ్





సెంచరీలతో చెలరేగిన ఆంధ్రా బ్యాట్స్‌మెన్ రిక్కీబుయ్, కరణ్ షిండే

విజయనగరం: ఆంధ్రా బ్యాట్స్‌మెన్ కరణ్‌షిండే (180 బంతుల్లో 11ఫోర్లు, 1 సిక్సర్స్‌తో 105 పరుగులు), రిక్కీ బుయ్ (150 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 116 పరుగులు)ల అద్భుత్ బ్యాటింగ్ ప్రదర్శనతో ఆంధ్రా జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించింది. నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ వేదికగా జరుగుతున్న ఆంధ్రా– హైదరాబాద్ జట్ల మధ్య రంజీ మ్యాచ్ డెంకాడ మండలం చింతలవలసలో గల పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ) ఆవరణలో మూడవ రోజు గురువారం మ్యాచ్ కొనసాగింది. మూడవ రోజు ఆంధ్రా బ్యాట్స్‌మెన్ రిక్కీ బుయ్, కరణ్ షిండేలు సెంచరీలతో చెలరేగారు. 48 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 230 పరుగులు ఓవర్ నైట్ స్కోరు వద్ద మూడవ రోజు గురువారం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మొత్తం 107.3 ఓవర్లలో 462 పరుగులు భారీ స్కోరు చేసి ఆలౌటైంది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో 2 వికెట్లు నష్టపయి 75 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో హైదరాబాద్ బ్యాట్స్‌మెన్ కె.రోహిత్ రాయుడు 46 పరుగులతో నాటౌట్‌గా కొనసాగుతుండగా..ఆంధ్రా బౌలర్లు కేవీ.శశికాంత్, కె.సుదర్శన్‌లు చెరో వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు హైదరాబాద్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 197పరుగులు చేయగా..ఆంధ్రా జట్టు 135 పరుగులు చేసిన విషయం విదితమే. ఇదిలా ఉండగా టెస్ట్ మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు నిర్వహించే మ్యాచ్‌లో శుక్రవారం మ్యాచ్ ముగియనుంది.

నేడు ఐపీఎల్ ఎంపికైన క్రీడాకారులకు సన్మానం

2023వ సంవత్సరంలో జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శుక్రవారం సత్కరించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎస్‌రాజు తెలిపారు. నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీలో సాయంత్రం 4.30 గంటలకు క్రీడాకారులు కేఎస్.భరత్, నితీష్‌కుమార్‌రెడ్డి, రషీద్‌లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ కోవిడ్-19 నిబంధనలు పాటించాలి

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ సూర్య కుమారి



ఎ.సూర్యకుమారి, కలెక్టర్

విజయనగరం అర్బన్: ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ కోవిడ్-19 నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కోవిడ్ నిబంధనలు విధిగా పాటించాలని ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించేలా ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలని గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాలుగో వేవ్ పై ప్రజలను అప్రమత్తం చేయడంలో కింది స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల సభ్యులు, స్వచ్ఛందసేవా సంస్థల నిర్వాహకుల నుంచి సహాయం పొందాలని సూచించారు. సఖి గ్రూపుల సభ్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ కోవిడ్ నాలుగో దశ ప్రమాదంపై ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆరు మీటర్ల భౌతిక దూరం పాటించాలని, గుమిగూడరాదని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, శానిటైజర్ వినియోగించాలని సూచించారు. వైద్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా వారిలో ధైర్యం నింపాలని పేర్కొన్నారు.

పరామర్శకు వెళ్తూ మహిళ మృతి

- బైక్‌లో చీర కొంగు చుట్టుకుని ప్రమాదం



ప్రమాదంలో మృతిచెందిన పాలక లలిత

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: ద్విచక్ర వాహనం వెనుక టైరులో చీర కొంగు చుట్టుకుని కింద పడిపోవడంతో గిరిజన మహిళ పాలక లలిత(44) మృతిచెందింది. ఈ సంఘటన కురుపాం మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కొత్తూరులోని ఓ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తన చెల్లెలు అరుణకుమారి కుమార్తెను పరామర్శించేందుకు కురుపాం మండలం వలసబల్లేరు గ్రామానికి చెందిన లలిత తన మరిదితో కలిసి గురువారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యంలో డంగులగూడ గ్రామ సమీపంలో ఆమె చీర కొంగు గాలి కారణంగా జారి బైక్ వెనుక టైరులోకి చొచ్చుకుపోవడంతో కింద పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను హుటాహుటిన 108లో నీలకంఠాపురం పీహెచ్‌సీకి తీసుకురాగా ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడి వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం నిమిత్తం గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి భద్రగిరి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలి భర్త కేశవరావు ఏడాది క్రితమే మృతిచెందాడు. ఆమెకు వంశీ, నాని, చందు అనే ముగ్గురు పిల్లలున్నారు. తండ్రితో పాటు తల్లి కూడా మరణించడంతో ముగ్గురు పిల్లలు భోరున విలపిస్తున్నారు. ఈ సంఘటనపై నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. శవపంచనామా అనంతరం భద్రగిరి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందించారు.

ఓటరు సవరణ జాబితా విడుదల

- పర్లాకిమిడి జిల్లాలో 4,37,319మంది ఓటర్లు
- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం



ఓటరు సవరణ జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా, ఏడీఎం పండా

పర్లాకిమిడి: గజపతి జిల్లాస్థాయి సంక్షిప్త ఓటరు జాబితాను అధికారులు గురువారం విడుదల చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి, కలెక్టర్ లింగరాజ్ పండా, సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సంగ్రాంశేఖర పండా హాజరయ్యారు. 2022 డిసెంబర్ 8వరకు అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో బీడీఓలు, తహసీల్దార్లు ఓటర్ల జాబితాను సరిదిద్ది, నూతన జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. దీని ప్రకారం జిల్లాలో మొత్తం 4,37,319మంది ఓటర్లు ఉన్నారని ప్రకటించారు. ఇందులో పురుషులు 2,14,522, మహిళలు 2,22,776, కిన్నెరులు 21మంది ఉన్నారన్నారు. మోహానా నియోజకవర్గ పరిధిలో 2,28,846మంది ఓటర్లు ఉండగా, పురుషుల 1,11,569, మహిళలు 1,17,274, కిన్నెరులు ముగ్గురు ఉన్నట్లు వెల్లడించారు. పర్లాకిమిడి నియోజకవర్గంలోని 2,08,473మంది ఓటర్లలో పురుషులు 1,02953, మహిళలు 1,05502, కిన్నెరులు 18మంది ఉన్నట్లు వివరిచారు. అర్హులైన యువజనులు ఫారం-6 పూర్తిచేసి, ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఓటరు ఐడీకి అధార్ అనుసంధాన ప్రక్రియ 80శాతం పూర్తయ్యిందని ఏడీఎం సంగ్రాంశేఖర పండా తెలిపారు. జిల్లాలో 276 బూత్‌లు మార్పునకు అనుగుణంగా జాబితాను సరిచేసినట్లు సబ్ కలెక్టర్ అలోక్ ప్రధాన్ పేర్కొన్నారు. సమావేశంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, సీపీఐ నాయకులు సుభాష్ చంద్రరావు, కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్‌చంద్ర మఝి, బీజేపీ, ఆమ్‌ఆద్మీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్‌లో 4,07,441 మంది..



జయపురం: ఓటరు జాబితాను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, సిబ్బంది

జయపురం: కొరాపుట్ జిల్లాలోని జయపురం, కొట్‌పాడ్ శాసనసభ నియోజకవర్గాల్లో 4,07,441 మంది ఓటర్లు ఉన్నారని సబ్ డివిజన్ ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ వెల్లడించారు. రెండు శాసనసభల ఓటర్ల జాబితాలను స్థానిక కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని తెలిపారు. 2023 జనవరి 1నాటికి కొట్‌పాడ్–143(ఎస్‌టీ) అసెంబ్లీ నియోజకవర్గంలో 2,01,825 మంది ఓటర్లు ఉండగా.. వారిలో మహిళలు 1,03,638 మంది, పురుషులు 98,172 మంది, కిన్నెరులు 15మంది అని తెలిపారు. అలాగే జయపురం–144(జనరల్) శాసనసభ నియోజకవర్గంలో మొత్తం 2,05,616 మంది ఓటర్లలో పురుషులు 99,882మంది, మహిళలు 1,05,700, కిన్నెరులు 34మంది అని ప్రకటించారు.



ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్ విశాల్‌సింగ్

30,121 దరఖాస్తులు..

మల్కన్‌గిరి: జిల్లాలో నూతనంగా చేరిన ఓటర్ల వివరాల జాబితాను జిల్లా కార్యాలయంలో కలెక్టర్ విశాల్‌సింగ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని తెలిపారు. గిరిజనుల్లో అవగహన కల్పించడం కారణంగానే ఓటరు చేరేందుకు అత్యధికులు ఆసక్తి చూపారన్నారు. ఇప్పటి వరకు కొత్త ఓటర్లుగా నమోదుకు 30,121 నూతన దరఖాస్తులు అందాయని వివరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అక్షయకుమార్ ఖేముండు, జిల్లా అదనపు కలెక్టర్ మహేశ్వర్ చంద్రనాయక్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జిల్లావ్యాప్తంగా 30 పోలీసు చట్టం అమలు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఏపీ 30 పోలీసు చట్టం అమలులో ఉందని, ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, గుంపులుగా ఏర్పడటం, ర్యాలీలు ఏర్పాటు చేస్తే చట్టాన్ని ఉల్లంఘించిన నేరం కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జీఆర్ రాధిక ఓ ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీలు ఏవైనా సరే సంబంధిత ప్రాంతంలో ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు అక్కడి పోలీసు అధికారులను సంప్రదించి అనుమతి తీసుకోవాలని సూచించారు.

శ్రీముఖలింగేశ్వరుని బంగారు, వెండి ఆభరణాలు తూకం


స్వామివారి ఆభరణాలు లెక్కిస్తున్న అధికారులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరుని బంగారు, వెండి ఆభరణాలు తూకం వేసి ఆలయ అధికారులకు అప్పచెప్పినట్లు జ్యూలరీ వెరిఫికేషన్ అబ్జర్వర్ అధికారి(రాజమండ్రి) ఏవీ దుర్గాభవాని తెలిపారు. ఆమె గురువారం దేవదాయ శాఖ అధికారులు, అర్చకుల సమక్షంలో స్వామి ఆభరణాలను పరిశీలించి తూకం వేసి లెక్కించారు. అంతకు ముందు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ పి.ప్రభకరరావు,సిబ్బంది ఉన్నారు.

'రాజీ పడదగ్గ కేసులు పరిష్కరించాలి'


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ చేయటానికి ముందుకు రావాలని, రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన కోర్టు హాల్‌లో గురువారం పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 11న లోక్ అదాలత్ నిర్వహిస్తామని, ఇందులో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్ కేసులు పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. మానసికంగానూ ప్రశాంతత లభిస్తుందని సూచించారు.

30 నుంచి కమ్మసిగడాం జాతర


జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

రణస్థలం: ఉత్తరాంధ్ర కల్పవల్ల కమ్మసిగడాం శ్రీమహాలక్ష్మి తల్లి జాతర ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కమ్మసిగడాం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జాతర ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ అమ్మవారి కల్యాణం, జాతరలో దుకాణాల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెలిచేటి రామకృష్ణ, వి.తేజ, వి.రాజశేఖర్, మన్నె లక్ష్మీ ప్రసాద్, వెలిచేటి ఫల్గుణరావు ఉన్నారు.

8న జానపద కళాజాత


పలాస: పలాస మండలం రంగోయి గ్రామంలో ఈ నెల 8న నిర్వహించనున్న జానపద కళాజాత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జానపద కళా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పలాస సూదికొండలో డప్పు కళాకారులతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల డప్పు కళాకారుల అధ్యక్షుడు తోట శిమ్మయ్య, కె.గణేష్, బి.రామారావు, ఆర్. సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎలుగు హల్‌చల్

సోంపేట: మండలంలోని మామిడి పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం రాత్రి ఎలుగు బంటి హల్ చల్ చేసినట్లు స్థానికులు తెలిపారు. కేంద్రంలోని పౌష్టికాహారాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అటవీ శాఖాధికారులు స్పందించి ఎలుగులు బారి నుంచి స్థానికులను కాపాడాలని సర్పంచ్ పాతిన శేషగిరి కోరారు.

యోధులు వీరు.. గాథలు చూడు


అవార్డు అందుకున్న ఆశిష్



- యోగాలో రాణిస్తున్న సిక్కోలు రత్నాలు
- జాతీయ స్థాయిలో మెరుపులు

అందరి వయసు 20లోపే. ఖ్యాతి మాత్రం దేశాంతరాలను తాకుతోంది. అందరూ సామాన్య కుటుంబాలకు చెందిన వారే. ఎంచుకున్న దారి వారిని ప్రత్యేకంగా నిలబెడుతోంది. వారికి ఆసనం ఆరోగ్యమే కాదు అవార్డులనూ తెచ్చి పెడుతోంది. ఒంటిని వింటిలా వంచి చేస్తున్న విన్యాసాలకు పతకాలు వచ్చి వాలుతున్నాయి. వారు యోగాను నమ్ముకుంటే.. అదృష్ట యోగం వారిని వరిస్తోంది. చిరుస్థాయిలో ప్రారంభించి శిఖర స్థాయి దిశగా వారి ప్రయాణం సాగుతోంది.




యోగాసనాలు వేస్తున్న జి. లోకేశ్వరి

170 సెకన్లలో 27 ఆసనాలు..

ఆసనాలతో ఆశిష్

కాశీబుగ్గ: వయసు పట్టుమని పదేళ్లు కూడా లేవు. కానీ ఈ పిల్లాడి విన్యాసాలను చూస్తే ఒళ్లు జలదరించకమానదు. పదేళ్లకే ప్రపంచ బుక్‌లో తన పేరును లిఖించుకున్నాడు పలాసకు చెందిన సంపతిరావు ఆశిష్. పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో ఐదో తరగతి చదువుతున్న ఆశిష్ చిరు ప్రాయంలోనే యోగాను వంటబట్టించుకున్నాడు. వసతి గృహంలో వేకువజామున లేచి వ్యాయామంతో పాటు కిరణ్ అనే కోచ్ వద్ద ఆసనాలు వేయడం నేర్చుకున్నాడు. ఆసనాలపై ఆసక్తి పెరగడంతో అతనికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తోంది. టెక్కలి మండలం బలరాంపురం గ్రామానికి చెందిన సంపతిరావు మోహన్‌బాబు, అమ్మోజిలు బాలుడి తల్లిదండ్రులు. పాల్గొన్న ప్రతి పోటీలనూ పతకాలను కైవసం చేసుకోవడం ఆశిష్ ప్రత్యేకత. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయిలో 650 మంది చిన్నారుల్లోఅండర్-14లో టాప్ టెన్‌లో నిలిచాడు. శ్రీకాకుళం జిల్లాలో స్కూల్ గేమ్స్‌లో యోగా విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. రెండు నిమిషాల 50 సెకన్లలో 27 ఆసనాలు వేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. ఇందుకు గాను భారత్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుతో పాటు మరో రెండు పుస్తకాల్లో పేరు నమోదు చేసుకున్నాడు. నటనలో రాణించడంతో శ్రీశ్రీ కళా వేదిక నుంచి బాలరత్నఅవార్డుఅందుకున్నాడు.

జాతీయ స్థాయికి..

కంచిలి: జాడుపూడిలోని కేజీబీవీలో ఇంటర్ చదువుతున్న గున్న లోకేశ్వరి యోగాలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23, 24 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచి, గోల్డ్‌మెడల్‌ను సాధించింది. దీంతో జాతీయస్థాయి పోటీల్లో ఆడేందుకు అర్హత సాధించింది. 2018 సంవత్సరంలో జిల్లాస్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్ పోటీల్లో నిర్వహించిన యోగాసనాల పోటీల్లో పాల్గొంది. అప్పట్లో జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. తర్వాత కరోనా సీజన్ ప్రారంభం కావడంతో ఆ రెండేళ్లు ఎలాంటి పోటీలు నిర్వహించకపోవడంతో రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశం లేకపోయింది. అయినా ప్రాక్టీస్ మరువలేదు. మళ్లీ ఈ ఏడాది నిర్వహించిన పోటీల్లో పాల్గొని తన ప్రతిభను కనబర్చింది. మందస మండలం భైరిసారంగపురం గ్రామానికి చెందిన లోకేశ్వరి తల్లిదండ్రులు బాలరాజు, వాణిలు రోజువారీ కూలీలు. సామాన్య నేపథ్యమే అయినా తన ప్రయాణాన్ని ఆమె అసామాన్యంగా మార్చుకుంది. టెన్త్‌లో కూడా 600లకు గాను 532 మార్కులు సాధించింది. ఈమె ఉత్సాహానికి తగ్గట్టుగా పాఠశాల పీఈటీ పిట్ట మహాలక్ష్మి కూడా తర్ఫీదునిస్తున్నారు.

ప్రతిభ ఉంటే పేదరికం అడ్డుకాదు..


యోగాసనాలు వేస్తున్న అవినాష్



ప్రతిభ ఉన్నోడికి పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు ఎల్.ఎన్.పేట మండలం రావిచెంద్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రంగాల అవినాష్. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయిలో యోగాలో ప్రథమ స్థానంలో నిలిచి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, రాయవరంలో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి తృతీయ స్థానంలో నిలిచాడు. సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన రంగాల అవినాష్ అమ్మ గీత, నాన్న గాంధీ ఇద్దరు వలస కూలీలే. వీరిద్దరు చెన్నై వంటి పట్టణాలకు భవన నిర్మాణ కార్మికులుగా పనులు చేసేందుకు వెళతారు. ఈ క్రమంలో అవినాష్‌ను తాత చంద్రయ్య ఇంటి వద్ద చదివిస్తున్నారు. 2019లో పదోన్నతితో కూడిన బదిలీపై రావిచెంద్రి జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చిన పీడీ పిల్లా రమణమ్మ అవినాష్ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. అప్పటి నుంచి అవినాష్ రాటుదేలాడు. జాతీయ స్థాయిలో నిలవాలన్నదే తన ధ్యేయమని విద్యార్థి చెబుతున్నాడు.

– ఎల్.ఎన్.పేట

సొంత స్థలమిచ్చి.. ఆక్రమణలు తొలగించి..

- స్ఫూర్తిగా నిలుస్తున్న మూలిపాడు సర్పంచ్ వెంకటరావు


మూలిపాడులో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మందస: ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా ఆక్రమించడానికే ప్రాధాన్యమిస్తున్న తరుణంలో ప్రజలకు మంచి చేయాలన్న తలంపుతో ముందుగా తన స్థలమిచ్చి స్ఫూర్తిగా నిలుస్తున్నారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు. మందస మండలంలోని మూలిపాడు పంచాయతీకి కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా రహదారి ఉండడంతో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు రూ.82లక్షలు మంజూరు చేశారు. అప్పటికే రోడ్డు ఆక్రమణలకు గురవ్వగా.. ముందుగా వెంకటరావు సుమారు మూడు సెంట్ల సొంత స్థలాన్ని రోడ్డు నిర్మాణానికి అందజేశారు. అనంతరం ఆక్రమణలు తొలగించి, రహదారి నిర్మాణం పూర్తి చేయించారు. కాగా, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి కూడా ఆటంకం ఏర్పడింది. గ్రామం సమీపంలోని పెద్దచెరువు వద్ద ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మించడానికి ప్రయత్నాలు చేయగా.. అప్పటికే ఆక్రమణదారులు ప్రతిఘటించారు. అధికారులు, పోలీసుల సాయంతో ఆక్రమణలు తొలగించిన వెంకటరావు రూ.10లక్షలతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం కూడా నిర్మించారు. దీంతో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రత్యేకంగా అభినందించి మూలిపాడును ఆదర్శంగా తీసుకోవాలని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో చెప్పారు. కలెక్టర్, జేసీ, ఆర్డీఓలు కూడా మూలిపాడులో పర్యటించి సర్పంచ్ చేస్తు న్న అభివృద్ధిని కొనియాడారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ మంత్రి అప్పరాజు, అధికారుల ప్రోత్సాహంతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానన్నారు.

కబడ్డీ పోటీల విజేత గుంటూరు


హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు


ప్రపంచస్థాయి కబడ్డీ ఆటగాడు ప్రదీప్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

పాతపట్నం: పాతపట్నం మార్కెట్ కమిటీ యార్డ్ ఆవరణ లో ప్రదీప్ యువసేన, సింహా అకాడమీ బేనియా సింహా ఆధ్వర్యంలో నర్వల్ కబడీ స్పోర్ట్స్ అకాడమీ రెండు రోజులు గా నిర్వహించిన కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. తెలంగాణ నుంచి నిజాంపేట, జీడిమెట్ల జట్లు రాగా, ఆంధ్రప్రదేశ్ నుంచి గుంటూరు, శ్రీకాకుళం, పాతపట్నం మోడ ల్ కాలేజీ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోరులో గుంటూరు ప్రథమ, నిజాంపేట ద్వితీయ, జీడిమెట్ల జట్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ప్రపంచ కబడ్డీ ఆటగాడు ప్రదీప్ నర్వాల్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా గేమ్స్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్లు అచంట సుబ్బారావు, పి.జీవన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బెనియా సింహాచలం, తెలంగాణ నర్వల్ అకాడమీ కోచ్ రమేష్ నర్వాల్, యోగేష్ నర్వల్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండాల అర్జునరావు, పాతపట్నం నీలమణిదుర్గ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, కోడూరు సర్పంచ్ పనుకు మోహనరావు, గిరిజన నాయకుడు గరాడి అప్పన్న, సత్యసుమ, ఎన్.నారాయణరావు, షేక్ సత్య సుల్తాన్, బి.దేవి, పాతపట్నం ఎస్సై కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మ ఉయ్యాలా.. కొంగ జంపాలా


మోడువారిన చెట్టుకు కొంగలు కుసుమాల్లె కనిపిస్తున్నాయి. శ్రీకాకుళం జాతీయ రహదారి సింగుపురం రోడ్డు వద్ద చెట్టుపై కొంగలు వాలి కనువిందు చేశాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

హారతి వెలుగులో అత్రి పుత్రుడు

అత్రి మహర్షి పుత్రుడు దత్తాత్రేయుడు హారతి వెలుగులో దివ్యమంగళ స్వరూపమై కనిపించాడు. శ్రీకాకుళంలోని బలగ నాగావళి తీరంలో వెలసిన శ్రీబాల త్రిపుర కాలభైరవ పీఠంలో దత్తాత్రేయునికి గురువారం అభిషేకాలు చేశారు. – శ్రీకాకుళం కల్చరల్



విద్యార్థినులను ఇళ్లకు పంపించేందుకు 11 బస్సులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)లో దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థినులను సురక్షితంగా ఇళ్లకు పంపించే చర్యలు అధికారులు చేపడుతున్నారు. ఏడో తేదీ నుంచి ఈ నెల 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించగా, విద్యార్థినులు ముందుగానే ఇళ్లకు చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో 11 ఆర్టీసీ బస్సులను ప్రస్తుత ధరల మేరకు అద్దెకు తీసుకున్నారు. పశ్చమగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల విద్యార్థులు ఈ బస్సుల్లో సొంతూళ్లకు ప్రయాణమవుతున్నారు. తల్లిదండ్రుల సూచనల మేరకు విద్యార్థినులను సురక్షితంగా పంపిస్తున్నామని పరిపాలన అధికారి ఎం.సత్యనారాయణ తెలిపారు.


ఇళ్లకు పయనమైన విద్యార్థులు

27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

గార: శ్రీకూర్మం గ్రామంలో సింహాద్రి నాగమణి ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ బి.రామారావుతో పాటు సిబ్బంది దాడులు జరిపి బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ దాడుల్లో రెవెన్యూ పరిశీలకులు ఆర్ అప్పలరాజు. వీఆర్ఐ జగదీశ్వరరావు, ఈశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


బియ్యంను పరిశీలిస్తున్న దృశ్యం

బండి భద్రంగా నడపండి


మాట్లాడుతున్న డీటీసీ శ్రీదేవి

శ్రీకాకుళం రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను భద్రంగా నడపాలని జిల్లా ఉప రవాణాశాఖాధికారి సీహెచ్ శ్రీదేవి సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాలలో గురువారం రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనచోదకులు ముఖ్యంగా యువత హెల్మెట్ విధిగా ధరించి బైక్ నడపాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాల బారిన పడటమే కాకుండా కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోతాయని గుర్తు చేశారు. కళాశాల అసోసియేట్ డీన్ డి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతా ఇన్‌స్పెక్టర్లు ఆర్.శంకరరావు, శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోరుకు సిద్ధం

- 8న శ్రీకాకుళం ఇండోర్ స్టేడియం వేదికగా జిల్లాస్థాయి పోటీలు
- ఇక్కడ రాణిస్తే రాష్ట్రపోటీలకు నేరుగా ఎంపిక


పోటీలకు ఆతిథ్యమిస్తున్న శ్రీకాకుళం బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ఇదే

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 8వ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియం వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. జిల్లాలో ఏడాది పాటు శిక్షణ పొందుతున్న మాస్టర్స్ (35ఏళ్ల పైబడిన) బ్యాడ్మింటన్ క్రీడాకారులకు శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ తీపికబురు అందించింది. ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారులను నేరుగా రాష్ట్రపోటీలకు పంపించనున్నారు. టోర్నమెంట్‌లో శ్రీకాకుళం జిల్లాకు చెంది, 35 ఏళ్ల పైబడినవారంతా పాల్గొనవచ్చు. మొత్తం 9 వయో విభాగాల్లో ఇండోర్ స్టేడియం వేదికగా పోటీలను నిర్వహించేందుకు కసరత్తులు చేస్తున్నారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు.

మొత్తం 5 కేటగిరీల్లో పోటీలు..

మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలను పురుషులకు, మహిళలకు కలిపి మొత్తం 5 కేటగిరిల్లో నిర్వహించాలని నిర్ణయించారు. పురుషులకు సింగిల్స్, డబుల్స్, మహిళలకు సింగిల్స్, డబుల్స్‌లో పోటీలు వేర్వేరుగా నిర్వహించనుండగా ఇద్దరికీ మిక్స్‌డ్ డబుల్స్‌లో తొలిసారిగా పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలకు హాజరయ్యే మాస్టర్ షట్లర్స్‌కు వసతి, భోజనం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఇక్కడ రాణిస్తే రాష్ట్రపోటీలకు ఎంపిక

ఇక్కడ విజేతలుగా నిలిచిన మాస్టర్స్‌ను ఫిబ్రవరి 2 నుంచి 5వ తేదీ వరకు ప్రొద్దుటూరు వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు పంపించనున్నట్లు శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్ తెలిపారు. మాస్టర్ షట్లర్స్ ఈనెల 7వ తేదీ రాత్రి 9గంటల్లోగా తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని, రూ.400 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని సూచించారు. మరిన్ని వివరాలకు, ఎంట్రీల నమోదుకు 9440255255(సంపతిరావు సూరిబాబు), 9440413199 (అశోక్) నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

విజయవంతం చేయాలి..



శ్రీకాకుళం వేదికగా జరిగే జిల్లా మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్-2022 పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఇక్కడ రాణిస్తే రాష్ట్రపోటీలకు ఎంపికవుతారు. అందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరుతున్నాం. ఈ మీట్‌కు హాజరవుతున్న మాస్టర్స్ క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు కల్పిస్తున్నాం. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం.

– కిల్లంశెట్టి సాగర్, బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నాటుసారా అక్రమ రవాణా అరికట్టాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పూర్తిస్థాయిలో నాటుసారా తయారీ కేంద్రాలు లేకుండా చూడడమే కాకుండా, వాటి అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్పీ జీఆర్ రాధిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరిగిన నెలవారీ సమీక్ష సమావేశంలో భాగంగా సెబ్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు, సరిహద్దు ప్రాంతాల నుంచి రవాణా అవుతున్న అక్రమ మద్యాన్ని అడ్డుకట్ట వేయాలని, వీటి రవాణా కేంద్రాలపై పూర్తి సమాచారాన్ని సేకరించి వ్యూహాత్మకంగా దాడులు నిర్వహించాలన్నారు. నాటుసారా తయారీ, ఉత్పత్తి, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉండాలన్నారు. వాహన తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాన్ని నియంత్రించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై కళాశాలల విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించడమే కాక గిరిజన ప్రాంతాల్లో పరివర్తన చేపట్టి నాటుసారా వల్ల కలిగే నష్టాల గురించి వివరించాలని తెలిపారు. అనంతరం పలు కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన పది మంది సిబ్బందికి జేడీ వి.నాగమణికంఠ ప్రశంసా పత్రాలు అందించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కేపీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.